రాజకీయాలకతీతంగా అభివృద్ధి పనులు



డైట్ కళాశాల ఆవరణలో కొత్త భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ

- పాలమూరు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- డైట్ కళాశాల కొత్త భవన నిర్మాణానికి శంకుస్థాపన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాజకీయాలకతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పాలమూరు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ కింద రూ.8.26 కోట్లతో నిర్మించనున్న డైట్ కళాశాల కొత్త భవనానికి బుధవారం ఎంపీ డీకే అరుణతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం పీయూలో లా, ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్ నగర్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చడమే తమ ధ్యేయమన్నారు. 2008లో కేవలం రెండు కోర్సులతోనే ఆరంభమైన పీయూ దిన దినాభివృద్ధి చెందుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలోనే పీయూ ఉన్నతంగా నిలబడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. త్వరలోనే న్యాక్ పీయూ సందర్శించనున్నందున ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో పరిశుభ్రత చర్యలు చేపట్టాలన్నారు. పూర్వ విద్యార్థులతో సమ్మేళనం చేపట్టి ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించాలని వీసీకి సూచించారు. ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ విద్యార్థుల చదువులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వారికి అవసరమైన అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు.

యాదవుల అభ్యున్నతికి కృషి

యాదవుల అభ్యున్నతికి అన్నివిధాల కృషి చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక బృందావన్‌కాలనీలో జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. క్యాంపు కార్యాలయంలో బహుజన టీచర్స్ ఫెడరేషన్ (బీటీఎఫ్) క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

విద్యావ్యవస్థకు స్వర్ణయుగం ప్రారంభం

హన్వాడ: తెలంగాణ రాష్ట్రంలో విద్యావ్యవస్థకు స్వర్ణయుగం ప్రారంభమైందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గొండ్యాల్, లింగన్నపల్లి, మునిమోక్షం గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను మహబూబ్‌నగర్ ఎంపీతో కలిసి ప్రారంభించారు. ముందుగా మండంలోని గొండ్యాల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్మించిన అదనపు గదులను ప్రారంభించారు. అనంతరం గొండ్యాల్ గ్రామంలో కొలువైన శ్రీతిరుమలనాథ స్వామిని ఎంపీ, ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల12 నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. మండలంలోని లింగన్నపల్లిలో ఎన్ఆర్ ఈజీఎస్ రూ.20లక్షల నిధులతో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

ప్లే స్కూల్స్‌గా అంగన్‌వాడీ కేంద్రాలు

త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను ప్లే స్కూల్స్‌గా మారుస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మండలంలోని నాగినోనిపల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ రూ.12లక్షల నిధుల తో నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ఎంపీతో కలిసి శంకుస్థాపన చేశారు.కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ఏఎంసీ చైర్మన్ బెక్కరి అనిత, వైస్‌చైర్మన్ పెద్దవిజయ్‌కుమార్, డీసీసీ జనరల్ సెక్రటరీలు సిరాజ్‌ఖాద్రి, వి.కృష్ణయ్య, కృష్ణయ్యయాదవ్, మండల అధ్యక్షుడు మహేందర్, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, మాజీ ఎంపీపీ వర్దశేఖర్, తహసీల్దార్ కిష్యానాయక్, ఎంపీడీఓ యశోద, నాయకులు తిర్పతయ్య, కేశవులు, నర్సింహులు ఉన్నారు.

స్వయం సహాయక సంఘాలతో సోలార్ ప్లాంట్లు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్రంలో మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం అని, ఈ కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రజా ప్రభుత్వం విధాన పరమైన నిర్ణయం తీసుకుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం ప్రజాభవన్ నుంచి మంత్రులు సీతక్క, కొండ సురేఖలతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇంధన, గ్రామీణ అభివృద్ధి శాఖల మధ్య గత సంవత్సరం నవంబర్ 19న కుదిరిన ఒప్పందాన్ని కలెక్టర్లు ఉపయోగించుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. మహిళలకు పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. మహిళా సంఘాలు ప్లాంట్ల ఏర్పాట్లలో ఆర్థిక సహాయం కోసం బ్యాంకు అధికారులతో సమన్వయం చేయాలని సూచించారు. మహిళా సంఘాల భూముల్లో ప్లాంట్ ఏర్పాటుకు విద్యుత్ శాఖ రెడ్‌కో ద్వారా టెండర్లు ఆహ్వానించిందని, త్వరలో టెండర్లు ఓపెన్ చేసి వాటిని ఖరారు చేస్తారని అన్నారు. ఒక మెగావాటు ఉత్పత్తికి నాలుగు ఎకరాలు అవసరం ఉంటుందని ప్రతి జిల్లాలో 150 ఎకరాలకు తగ్గకుండా రాష్ట్రవ్యాప్తంగా సుమారు నాలుగువేల ఎకరాలు సేకరించాల్సి ఉంటుందని కలెక్టర్లకు తెలిపారు. దేవాదాయ, ఇరిగేషన్ శాఖల భూముల్లో సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తే ఎవరికి ఇబ్బంది ఉండదని సూచించారు. సమావేశంలో కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ జిల్లాలో మహిళా సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు జనవరి 20 లోగా 150 ఎకరాల స్థలం గుర్తించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జడ్చర్ల మండలం బాదేపల్లి సబ్‌స్టేషన్ లో ఒక మెగావాట్ ఉత్పత్తికి 4 ఎకరాల స్థలం గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు మోహన్‌రావు, శివేంద్రప్రతాప్, డీఆర్‌డీఓ నర్సింహులు, విద్యుత్ శాఖ ఎస్ఈ రమేష్, అటవి శాఖ అధికారి సత్యనారాయణ, ఏపీడీ జోజప్ప పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ విజయేందిర, అడిషనల్ కలెక్టర్లు

అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూర్ చేస్తామని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం దేవరకద్ర మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఇందిరమ్మ ఇంటి నమూనా భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. దేవరకద్ర నియోజకవర్గంలో ఇప్పటికే సర్వే పూర్తి చేశారని, నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామన్నారు. ప్రస్తుతం మాడల్‌గా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేయడానికి పనులు ప్రారంభించామన్నారు. ప్రతి లబ్ధిదారుడు దీన్ని చూసి తమ ఇంటిని నిర్మించుకోవచ్చని తెలిపారు.

ప్రజల చెంతకే పాలన అందిస్తాం

దేవరకద్ర రూరల్: ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల వద్దకే పాలన అందించాలనే సంకల్పంతో పని చేస్తున్నామని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. కౌకుంట్ల మండల కేంద్రంలోని రైతు వేదిక దగ్గర అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని సమస్యలను ఆయా గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పని చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో కురుమూర్తి దేవస్థాన చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్‌లు కతలయ్య, ప్రశాంత్, మండల అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్‌రావు, నరేష్ పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి నమూనా నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

క్లుప్తంగా

నేడు ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమావేశం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 10:30 గంటలకు స్థానిక పారిశ్రామివాడలోని సీనియర్ సిటిజన్ ఫోరం కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ ఫోరం జిల్లా అధ్యక్షులు ఎ.రాజసింహుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎస్పీ డి.జానకి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. సమావేశంలోని జిల్లాలోని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

రాజాపూర్: మండలంలోని కుచ్చర్‌కల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త వగ్గు నర్సింహులు తల్లి పెంటమ్మ బుధవారం మృతి చెందడంతో జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆనంద్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయ శ్రీశైలం తదితరులు ఉన్నారు.

మాజీ ఎంపీపీ కుటుంబాన్ని..

మిడ్జిల్: మిడ్జిల్ మాజీ ఎంపీపీ సుదర్శన్ తండ్రి బరిగెల బాలయ్య మంగళవారం మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పరామర్శించారు. అనంతరం చికిత్స పొందుతున్న మాజీ ఎంపీటీసీ సరోజ, టీఆర్ఎస్ నాయకులు కేశవ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన యాదయ్య, బాల్‌రెడ్డి, బాలు, ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్, గోపాల్, నవిన్, కృష్ణ, శ్రీను, భాస్కర్ ఉన్నారు.

బోయిన్‌పల్లిలో టీబీ క్యాంపు



మిడ్జిల్: మండలంలోని బోయిన్‌పల్లిలో బుధవారం టీబీ క్యాంపు నిర్వహించినట్లు వైద్యాధికారి శివకాంత్ తెలిపారు. ఈ శిబిరంలో 96 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిబిరంలో టీబీ అధికారులు యూసుఫ్, ప్రసాద్, సంపత్, దేవయ్య, అలీ, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం సీజ్

నవాబుపేట: మండల కేంద్రంలో అనుమతి లేని కూరగాయల విత్తనాలు విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దుకాణాన్ని సీజ్ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి కృష్ణకిషోర్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎర్రసత్యం చౌరస్తాలో శ్రీలక్ష్మీ ఏజెన్సీ దుకాణంలో కాకరకాయ, బీరకాయ, గోరుచిక్కుడు, కీరాలకు సంబంధించిన విత్తనాలు ప్రభుత్వం అనుమతి లేకుండా విక్రయిస్తున్నట్లు తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకుని దుకాణం సీజ్ చేశామన్నారు. అనుమతి లేని విత్తనాలు, నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

బురదలోపడి వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: బురద నీటిలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని సత్యమన్న కాలనీ క్రికెట్ స్టేడియం సమీపంలో బుధవారం బురదకుంటలో పడి గుర్తు తెలియని వ్యక్తి(45) మృతి చెందాడు. మద్యం మత్తులో బోర్లపడటం వల్ల మృతి చెంది ఉండవచ్చని ఎస్ఐ తెలిపారు. మృతుడికి సంబంధించిన వాళ్లు ఎవరైనా ఉంటే రూరల్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు. మృతదేహం పోస్టుమార్టం కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించడం జరిగిందని, ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మహబూబ్‌నగర్ క్రైం: తాళం వేసిన ఇంటిని లక్ష్యంగా చేసుకుని దొంగలు రెచ్చిపోయారు. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని సద్దలగుండుకు చెందిన ప్రేమ్‌కుమార్ కొన్ని రోజుల నుంచి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. వారానికి ఒకసారి మహబూబ్‌నగర్ ఇంటికి వచ్చివెళ్తుంటారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు ఇంట్లోకి ప్రవేశించి బీరువా పగులగొట్టి అందులో ఐదున్నర తులాల బంగారం ఎత్తుకెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దుకాణాల్లో పోలీసుల తనిఖీ

మహబూబ్‌నగర్ క్రైం: ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను దుకాణాదారులు విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ అప్పయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పాన్ చౌరస్తా ఏరియాలో ఉన్న దుకాణాల్లో బుధవారం వన్‌టౌన్ పోలీసుల బృందం విస్తృతంగా తనిఖీ నిర్వహించారు. గాలి పటాలు విక్రయించే దుకాణాలను తనిఖీలు చేయడంతో పాటు చైనా మాంజాలను విక్రయించరాదని సూచించారు. పతంగులు ఎగురవేసే సందర్భాల్లో మాంజా వాడటం వల్ల పక్షులు, మనుషులు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. ఎలాంటి దుకాణాల్లో అయిన వాటిని విక్రయిస్తే సదరు యాజమాన్యంపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పాదయాత్రికులకు ఘన సన్మానం



పాదయాత్ర చేస్తున్న వారిని సన్మానించిన సభ్యులు

స్టేషన్ మహబూబ్‌నగర్: లోక కల్యాణార్థం ద్వాదశ జ్యోతిర్లింగాలకు పాదయాత్ర చేస్తున్న వారిని బుధవారం జిల్లా కేంద్రంలో హైందవ శక్తి సభ్యులు, బీజేపీ సోషల్ మీడియా రాష్ట్ర జాయింట్ కన్వీనర్ మఠం మయూర్‌నాథ్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికి సన్మానం చేశారు. వారికి కొత్త సైకిల్ అందజేశారు. ఈ సందర్భంగా కర్ణాటకు చెందిన గీత మాట్లాడుతూ గతంలో కుటుంబసమేతంగా 11 రోజులపాటు తిరుపతి బాలాజీని దర్శనం చేసుకున్నట్లు తెలిపారు. ఐదుమంది స్వాములతో కలిసి కాశీకి పాదయాత్రగా వెళ్లి దర్శనం చేసుకోవడం జరిగిందన్నారు. ఒక స్వామిజీ సూచనతో ఇప్పుడు 12 జ్యోతిర్లింగాల పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. కుటుంబసభ్యులు భయపడినా తాను ఒంటరిగా రామేశ్వరం నుంచి పాదయాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. అక్కడి నుంచి శ్రీశైలం మల్లికార్జునస్వామి దర్శనం చేసుకొని వెళ్తున్న సందర్భంగా బ్రహ్మంగారి మఠం స్వామిజీ తన వెంట రావడానికి సిద్ధపడ్డారని తెలిపారు. పరిలీ వైద్యనాథ్ దర్శనానికి బయలుదేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రామ్, మణిప్రసాద్, ఓంరాఠీ, నిలేష్ రాఠి, అమర్, శ్రీను, గోయెల్ శ్రీను, వినయ్, జవహర్, శివారెడ్డి, నిరంజన్, వరప్రసాద్, రాంకొండ పాల్గొన్నారు.

బోయపల్లిలో డప్పు కళాకారుల రథయాత్ర

మహబూబ్‌నగర్ రూరల్: వెయ్యి గొంతుకలు–లక్ష డప్పుల కార్యక్రమంలో భాగంగా బుధవారం మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలోని బోయపల్లిలో డప్పు కళాకారుల బృందం ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు బోయపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో ప్రచార రథయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు కళాకారుల బృందం రాష్ట్ర కోఆర్డినేటర్ డప్పుస్వామి మాట్లాడారు. ప్రతి మాదిగ పొరుడు ఒక్కొక్కరు ఒక డప్పుతో లక్షలాదిగా తరలివచ్చి ఎస్సీ వర్గీకరణ ఆకాంక్ష ప్రపంచానికి చూపించేలా ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో, దళితవాడల్లో తిరుగుతూ 88 కులాలను సభకు తరలించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి టైగర్ జంగయ్య, శ్రీరాములు, కొండయ్య, కావలి ఆంజనేయులు, నాగరాజు, చంద్రశేఖర్, శ్రీకాంత్, యాదయ్య, సాయి పాల్గొన్నారు.



బోయపల్లిలో వెయ్యి గొంతుకలు–లక్ష డప్పుల సభ ఆవశ్యకతను వివరిస్తున్న కళాకారులు

సంస్కృతికి అద్దం పట్టేవి ముగ్గులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేవి ముగ్గులని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సబిత అన్నారు. బుధవారం కాలేజీలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విద్యార్థినులు, ఉపాధ్యాయులు రంగురంగుల ముగ్గులు వేశారు. సంప్రదాయం ఉట్టిపడేలా ముగ్గులు వేశారు. మన సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా ముగ్గులు వేశారు. ముగ్గుల పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కల్చరల్ కమిటీ సభ్యులు అనిత, సారిక, నవ్య, సునిత పాల్గొన్నారు. .

సమస్యలు పరిష్కరించాలని వీసీకి వినతి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తమ సమస్యలు పరిష్కరించాలని పీయూలో పనిచేసే బోధనేతర ఉద్యోగులు బుధవారం వీసీ జీఎన్ శ్రీనివాస్‌కు విజ్ఞప్తి చేశారు. త్వరలో హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో జరిగే వీసీల భేటీలో తమ సమస్యలు ప్రస్తావించాలంటూ వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బోధనేతర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాంమోహన్, ఉపాధ్యక్షుడు పర్వతాలు, ప్రధాన కార్యదర్శి బూరన్న పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులకు సన్మానం

పాలమూరు: ఎక్సైజ్‌శాఖలో పని చేస్తున్న నలుగురు ఆంధ్ర కానిస్టేబుళ్లను 610 జీఓ అమల్లో భాగంగా హైకోర్టు ఉత్తర్వులు అమలు చేసి సదరు కానిస్టేబుళ్లను తిరిగి ఆంధ్రాకు పంపించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ కానిస్టేబుల్స్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం డీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఏసీ విజయ్‌భాస్కర్‌రెడ్డిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నథనియల్, ప్రధాన కార్యదర్శి మల్లన్‌గౌడ్, బాలరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

పూడ్చిన శవానికి పోస్టుమార్టం

కోయిల్‌కొండ: ఇన్సూరెన్స్ డబ్బుల కోసం పూడ్చిన మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించిన సంఘటన బుధవారం మండలంలోని వీరంపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గతేడాది సెప్టెంబర్ 17న వీరంపల్లి గ్రామానికి చెందిన ఊశన్న (59) తన వ్యవసాయ పొలంలో బోర్‌మోటార్ దగ్గర ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. దీంతో మృతదేహానికి కుటుంబ సభ్యులు మరుసటిరోజు అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం బ్యాంకులో, ఎల్ఐసీ ఇన్సూరెన్స్‌లు ఊశన్న పేరుమీద ఉండడంతో మృతదేహానికి పంచనామా నిర్వహిస్తేనే డబ్బులు వస్తాయని బ్యాంకు అధికారులు తెలిపారు. దీంతో ఊశన్న భార్య సత్యమ్మ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 4న ఫిర్యాదు చేసింది. బుధవారం తహసీల్దార్ రాజాగణేష్, ఎస్ఐ భాస్కర్‌రెడ్డిల సమక్షంలో పూడ్చిన మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం చేసి పంచనామా నిర్వహించారు. ఈ సంఘటనపై ఎలాంటి అనుమానాలు లేవని తెలిపారు.

ఇద్దరు రంగస్థల నటులకు స్ఫూర్తి స్మారక అవార్డు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జైపాల్‌రెడ్డి స్ఫూర్తి స్మారక అవార్డుకు రంగస్థల నటులు దుప్పల్లి శ్రీరామ్, వరకవుల నరహరిరాజు ఎంపికైనట్లు సీనియర్ న్యాయవాది వి.మనోహర్‌రెడ్డి, రాష్ట్ర సంగీత నాటక అకాడమి మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్ తెలిపారు. బుధవారం ధర్మాపూర్‌లోని జేపీఎన్‌సీఈలో విలేకరులతో వారు మాట్లాడారు. కేంద్ర మాజీ మంత్రి దివంగత సూదిని జైపాల్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని ఈనెల 16న ఈ అవార్డులు ప్రదానం చేస్తామన్నారు. ముఖ్యంగా ఆయన పేరిట సన్మాన పత్రంతో పాటు రూ.25 వేల చెక్కు అందించనున్నట్లు తెలిపారు. ఈ అవార్డులు ఇవ్వడానికి ముందుకొచ్చిన జేపీఎన్‌సీఈ యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో జేపీఎన్‌సీఈ చైర్మన్ కేఎస్ రవికుమార్, బీకేఎస్ రాష్ట్ర నాయకుడు కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం కొత్త చెరువు రోడ్డులో వక్ఫ్ భూమిలో ఆక్రమణలు జరుగుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మిల్లీమహాజ్ ప్రతినిధులు బుధవారం జిల్లా రెవెన్యూ, వక్ఫ్ అధికారి రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వెంటనే భూమిని సర్వే చేసి ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతి అందజేసిన వారిలో మిల్లీ మహాజ్ కన్వీనర్ తఖీ హుస్సేన్, మిర్జా ఖుద్దూస్ బేగ్, మతీన్ ఉర్ రహెమాన్, బషీర్ ఖాద్రీ ఉన్నారు.

ఉత్తమ సేవలతోనే ఉపాధ్యాయులకు గుర్తింపు



అడ్డాకుల: మూసాపేట మండలం తుంకినీపూర్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తూ బదిలీపై వెళ్లిన మావిళ్ల లక్ష్మణ్‌గౌడ్, కురుమయ్యలను బుధవారం పాఠశాలలో హెచ్‌ఎం అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సన్మానించారు. శాలువా, పూలమాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఉత్తమ సేవలతోనే ఉపాధ్యాయులు తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు పద్మ, మాజీ సర్పంచులు బుచ్చన్నగౌడ్, లక్ష్మణ్, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ తిరుమల రాములు పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక



మహబూబ్‌నగర్ క్రీడలు: స్థానిక మెయిన్ స్టేడియంలో ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయస్థాయి అండర్–17 హ్యాండ్‌బాల్ పోటీలకు లిటిల్ స్కాలర్స్ స్కూల్ 9వ తరగతి విద్యార్థిని బి.పారిజాత ఎంపికైంది. ఆ పాఠశాల చైర్మన్ అరుంధతిరాయ్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థి జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, పీఈటీలు పాల్గొన్నారు.

యూత్‌ఫెస్టివల్‌లో 'రాములమ్మ' ప్రతిభ

పాలమూరు: డైరెక్టర్ ఆఫ్ యూత్ సర్వీసెస్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 6, 7తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన స్టేట్ యూత్ ఫెస్టి వల్ –2025లో సరోజిని రాములమ్మ ఫార్మసీ కళాశాలకు రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి లభించింది. యూత్ ఫెస్టివల్‌లో కళాశాల విద్యార్థులు శ్రావణి, సుష్మ, పావని, శ్వేత, అర్చన, మేఘన, సి.శ్వేత, సావిత్రి, గీతశ్రీ పాల్గొన్ని ప్రథమ స్థానంలో నిలిచారు. 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఢిల్లీలో నిర్వహించే జాతీయ యూత్ ఫెస్టివల్‌కు ఎంపికయ్యారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ బాలరాజు, ప్రిన్సిపాల్ మంగీలాల్ అభినందించారు.

సైబర్‌నేరాలపై జాగ్రత్తగా ఉండాలి

మహబూబ్‌నగర్ క్రైం: డిజిటల్ అరెస్టు ఉండదని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. సైబర్ జాగృక్త దివస్‌లో భాగంగా బుధవారం పట్టణంలోని స్వామి వివేకానంద డిగ్రీ కళాశాలలో సైబర్‌నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి సైబర్ క్రైం డీఎస్పీతో పాటు మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. ప్రధానంగా డిజిటల్ అరెస్టు మోసాలపై విద్యార్థులకు వివరించారు. అసలు డిజిటల్ అరెస్టు అనేది ఉండదని, దీనిని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు.

నవాబుపేట: సైబర్ నేరాల పట్ల జనం అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ విక్రమ్ సూచించారు. మండలంలో ఆయన పలు గ్రామాల్లో సైబర్ నేరగాళ్ల విషయాలు ఆయన వివరించారు. ఫోన్‌లో కొత్తనంబర్ లేదా అనుమానిత మెసేజ్‌లు వస్తే వాటిని ఇన్‌స్టాల్ చేయకూడదని ఆయన వివరించారు. కార్యక్రమంలో మైసమ్మ చైర్మన్ జగన్, మాదవులు, కృష్ణయ్య, బాలయ్య, ఖజామైనొద్దీన్ తదితరులు ఉన్నారు.



కాకర్లపహాడ్‌లో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ విక్రమ్

అడ్డాకుల: సైబర్ నేరగాళ్లు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి విద్యార్థుల తల్లిదండ్రులే లక్ష్యంగా సైబర్ మోసాలకు పాల్పడుతున్నారని, డిజిటల్ అరెస్టులంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నందున వాటికి స్పందించవద్దని అడ్డాకుల ఎస్ఐ ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాల అప్రమత్తతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శివరామకృష్ణ, పోలీసులు తదితరులు ఉన్నారు.

బీవీపీ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో బీవీపీ ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం లక్ష్మీనగర్ కాలనీలోని సాయి మందిరంలో బుధవారం విద్యార్థులకు స్వామి వివేకానంద గురించి ఇంగ్లిష్, తెలుగులో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 14 పాఠశాలల నుంచి 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. బీవీపీ అధ్యక్షులు భూషణ్‌పాండే మాట్లాడుతూ సరైన జీవన విధానం, దృఢమైన సంకల్పం, ఉన్నత లక్ష్యాలను సాధించుటకు స్వామి వివేకానందుని జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో బీవీపీ ప్రాంత సలహాదారు జి.పాండురంగం, రమేష్‌చందర్, రాఘవారెడ్డి, వీఎస్ఆర్‌కే ప్రసాద్, వెంకటేశ్వరగుప్త, యతిరాజాచారి, చంద్రుడు, సురేష్‌చంద్ దూత్, నాగేంద్రస్వామి పాల్గొన్నారు.

10న వైకుంఠ ఏకాదశి వేడుకలు

వేంకటేశ్వరస్వామి ఆలయంలో సప్తద్వారాలు దాటి స్వామి దర్శనం



వైకుంఠ ఏకాదశి వేడుకల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మండలి ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం పిల్లలమర్రి రోడ్డులోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 10న ధనుర్మాసంలో వచ్చే వైకుంఠ ఏకాదశి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు శ్రీవేంకటేశ్వరస్వామి సేవా మండలి ప్రతినిధులు వెల్లడించారు. బుధవారం దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా దేవాలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేవాలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం గుండా సప్తద్వారాలు దాటి స్వామి వారి దివ్య దర్శనం ఉంటుందన్నారు. తమిళనాడు కళాకారుల ద్వారా స్వామివారి అలంకరణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వేడుకల కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో సేవా మండలి అధ్యక్ష, కార్యదర్శులు తోటపల్లి శ్రీకాంత్‌శర్మ, రాఘవేందర్‌శర్మ, కోశాధికారి గుండా వెంకటేశ్, సభ్యులు వి.సుదర్శన్‌గౌడ్, వెంకట్రాములుగౌడ్, ప్రమోద్‌కుమార్, కొండా చక్రధర్‌గుప్త, మిర్యాల వేణుగోపాల్, ఆకుతోట సత్యనారాయణ పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే జైలుకే..

రాజాపూర్(బాలానగర్): తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇస్తే కేసు నమోదు చేయడంతో పాటు 10వేల జరిమానా, జైలు శిక్ష ఉంటుందని బాలానగర్ ఎస్ఐ తిరుపాజి పేర్కొన్నారు. బుధవారం బాలానగర్ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై, రోడ్డు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. మైనర్లను ఎవరైనా పనిలో పెట్టుకుంటే వారిపైన చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్స్, కానిస్టేబుల్ దేవేందర్‌రెడ్డి, హోంగార్డు బాల్‌రాజు, శివ విద్యార్థులు పాల్గొన్నారు.



బాలానగర్ జూనియర్ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ తిరుపాజి